


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 48 | ఆదివారం 16-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# రాహుల్ మాటే వేదవాక్కు

- ఎవరేమనుకున్నా పట్టించుకోను - తను చెప్పిందే చేస్తా.. ఎన్ని కష్టాలొచ్చినా భరిస్తా
- రాహుల్‌గాంధీతో నాకు గ్యాప్ అసత్య ప్రచారం - పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచీ జరుగుతోంది
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్ - రాహుల్‌తో 50 నిమిషాల పాటు రేవంత్ భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటే తనకు వేదవాక్కని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయడమే తన కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ఏం చెప్పారో అది మాత్రమే చేస్తానని, దానివల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, ఎవరు ఏమనుకున్నా పట్టించుకోనని తేల్చిచెప్పారు. రాహుల్‌తో తనకు దూరం పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. తన వ్యతిరేకుల పైశాచిక ఆనందం ఎప్పటికీ నెరవేరదని చెప్పారు. శనివారం ఢిల్లీలోని జన్‌పథ్‌లో రాహుల్‌గాంధీతో 50 నిమిషాల పాటు ముఖాముఖి సమావేశమైన రేవంత్‌రెడ్డి తెలంగాణలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి తన అధికారిక నివాసంలో మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఢిల్లీలో తనకు ప్రాధాన్యం తగ్గిందని, రాహుల్‌గాంధీతో ఎడం పెరిగిందని ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం కొత్తదేమీ కాదన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకం జరగక ముందు నుంచి తనపై ఇలాంటి ప్రచారం జరుగుతోందని, అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ముఖ్యమంత్రి అవుతడా? అంటూ ఇలాంటి చర్చలే పెట్టారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే టికెట్లు, రాజ్యసభ టికెట్ల విషయంలోనూ ఏవేవో కథలు ప్రచారం చేశారని చెప్పారు. అవన్నీ తాను పట్టించుకోనన్నారు. పీసీసీ అధ్యక్షుడయ్యాక ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయని, అన్నింటినీ సమర్థంగా ఎదుర్కొన్నానని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతల ప్రకారం ప్రజల్లోకి వెళ్లానని, ప్రజలు ఆశీర్వదించడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తనకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించిందని తెలిపారు. ఇక ప్రజలకు ఏం చేయాలన్నదే తనకు తొలి ప్రాధాన్య అంశమని చెప్పారు. రేపు ఏం చేశావని ప్రజలు అడిగేది తననేనని అన్నారు. పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకున్నపుడు కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావడం సహజమని రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యతిరేకతను అధిగమించి రాజభరణాల రద్దు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ చేసి చూపించిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన కూడా అలాంటివేనన్నారు. తనది కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్‌గాంధీ ఏం చెబితే అది చేస్తానన్నారు. వర్గీకరణ, కులగణన దేశానికి రోడ్ మ్యాప్ లాంటివని చెప్పారు. కుల గణన ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు,.

### ప్రధాని హెూదాకు భంగం కలిగేలా మాట్లాడలేదు

ప్రధానినరేంద్ర మోదీని కించపరిచేలా తానేమీ మాట్లాడలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పానన్నారు. తేదీల్లో ముందు వెనుక తేడాలు ఉండొచ్చేమో కానీ ప్రధాని గురించి తప్పుగా మాట్లాడలేదని చెప్పారు. మోదీకి బీసీల పట్ల నిజంగానే ప్రేమ ఉంటే జనగణనలో కుల గణనను జత చేయాలని సవాలు విసిరారు. మోదీ విషయంలో తన వ్యాఖ్యలను ఖండిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే స్వయంగా 1994లోమోదీ బీసీగా మారారని అంగీకరించారన్నారు.

# నెట్‌జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి15:** ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. ప్రభుత్వ అంకితభావం చాటిచెప్పడానికే ఐజీబీసీతో ఫ్యూచర్ సిటీపై ఎంఓయూ కుదుర్చు కున్నాం. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా మినహాయింపునిచ్చాం. రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని తెలిసినా.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలను మరింత పెంచేలా రూ.10 వేల కోట్లను కేటాయించాం. మూసీ సుందరీకరణ చేపట్టాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్తి రంగం ఆశించిన స్థాయిలో ఉంది. స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని భట్టి అన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త పింఛన్ విధానం

**హైదరాబాద్, ఫిబ్రవరి15:** కేంద్రం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ విధానం అమలుకు కసరత్తు పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో ఇక పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు యూపీఎస్ పథకం అమలు కానుంది. ఈ పథకం ఇప్ప టికే ఎన్పీఎస్ లో ఉన్న ఉద్యోగులకూ వర్తిస్తుంది. ఇది పాత పెన్షన్ పథకం, జాతీయ పెన్షన్ వ్యవస్థ రెండింటి ప్రయోజనాలను కలిపి యూపీఎస్‌గా రూపకల్పన చేసారు. ఇప్పుడు ఉద్యోగులు దీని నుంచి పెన్షన్ పొందుతున్నారు. యూపీఎస్ అనేది ప్రభుత్వ కొత్త పథకం. జనవరి 24న ప్రభుత్వం యూపీఎస్ ను అధికారికంగా నోటిఫై చేసింది. ఎన్పీఎస్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ యూపీఎస్ పథకం వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేసారు. వాజ్‌పేయి హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో పాత పెన్షన్ పథకం, ఎన్పీఎస్ ప్రయోజనాలను కలిపి తాజాగా యూపీఎస్‌గా రూపొందించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు చివరిగా వారు తీసుకున్న జీతంలో50% పెన్షన్‌గా అందిస్తుంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం,కుటుంబ పెన్షన్,ఏకమొత్తంచెల్లింపు వంటి ప్రయోజనాలు అందుతాయి.

# ఢిల్లీలో ఆప్‌కు వరుస షాక్‌లు

**బిజెపిలో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి15:** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో పార్టీ నేతలు షలక్ ఇస్తున్నారు. ఈ ఓటమి నుంచి తేరుకోకముందే.. మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికీ ఢిల్లీ సిఎం ఖరారు కాలేదు. ప్రభుత్వం ఏర్పడకముందే.. ఆప్ నేతలు బిజెపిలో చేరేందుకు క్యూ కడుతున్నారు. తాజాగా శనివారం ముగ్గురు కౌన్సిలర్లు బిజెపిలో చేరారు. వీరంతా ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు. ఏప్రిల్‌లో జరిగే మేయర్ ఎన్నికలకు ముందుఈ పరిణామం ఆప్‌కి ఎదురెబ్బ అని చెప్పొచ్చు.ఆప్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు అనిత బసోయ (ఆంద్రూస్ గంజ్), నిఖిల్ చాప్రాన (హరి నగర్), ధర్మవీర్ (ఆర్కేపురం) చేరికపై వీరేంద్ర సచ్‌దేవ మాట్లాడుతూ.. 'ఢిల్లీ కేంద్రంలో, అసెంబ్లీ, మున్సిపల్ స్థాయిల్లో ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఏర్పడనుంది. మోడీ ఆశిస్తున్న వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఢిల్లీ అభివృద్ధికి ఇదే సరైన తరుణం' అని అన్నారు. ఢిల్లీని క్లీన్ అండ్ బ్యూటిఫుల్ సిటీగా మార్చేందుకు ఆప్ కౌన్సిలర్లు బిజెపిలో చేరారు' అని ఆయన అన్నారు.




# పోయిరావమ్మా.. సమ్మక్కతల్లి..

జనం నుండి వనంబాట పట్టిన సమ్మక్క..

చందా వంశస్తుల చే కోయతుత్తూర్ సంప్రదాయ పూజలు..

సాగనంపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, కోయపుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ, ఆలయ పూజారి చందా వీరయ్య,చందా బిక్షపతి

- హారతులు ఇచ్చిన చందా వంశీయ మరియు చిరుమళ్ల ఆడపడుచులు





**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి15:**
చిరుమళ్ళ పుట్టుగద్దెల సమ్మక్క జాతర ముగిసింది. అత్యంత గొప్ప పండుగగా కొలుచుకునే ఆదివాసీ ఇలవేల్పు సమ్మక్క తల్లి మధ్యాహ్నం చిరుమ ళ్ళ పుట్టుగద్దెల నుండి మధ్యాహ్నం 2గంటల సమయంలో బయలెల్లింది .చిరుమళ్ళ సర్వత్రా తల్లి సాగనంపు లో పాల్గొన్నారు,మమ్ములను చల్లంగా చూడమ్మ, దీవించమ్మా.. తిరిగి రెండు సంవత్సరాలకు తిరిగి రావమ్మా అంటూ ఊరు ఊరు అంతా సమ్మక్క తల్లిని పంపుతూ అలాయ్ బాలయ్,చేసుకున్నారు. సాగనంపు ప్రక్రియ మొత్తంగా డోలు దెబ్బలు, శంకు, అక్కుమ్,డమరుకం శబ్దాల జలదరింపుల్లో చిరుమళ్ళ అబాల గోపాలం తల్లి సాగనంపు ప్రక్రియ లో పాల్గొన్నారు.తల్లి వెళ్లే దారిలో భక్తులు బోర్ల పడుకోగా..వారిపైనుండి అడుగులు వేస్తూ సమ్మక్క తల్లి వెళ్లి పోవడం సర్వత్రా ఆసక్తి చోటుచేసుకున్నది. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, కోయ పుణ్యం ధర్మ ప్రచారక్, ఆదివాసీ 9 తెగల సమన్వయ కర్త, ఉత్సవ కమిటీ సలహాదారు చుంచు రామకృష్ణలు పాల్గొన్నారు. వీరితోపాటు, ఆలయ ధర్మకర్త చందా బిక్షపతి ఆలయ పూజారి చందా వీరయ్య ఖజానా బాధ్యులు చందా భూపతయ్య ముసలమ్మ గుట్ట మార్గ నిర్దేశకులు చందా గోవర్ధన్. చందా రామారావు, చందా సమ్మయ్య, చందా సంతోష్ కుమార్, చందా శ్యామ్ చందా సాయి, చందా ప్రసాద్, చందా వంశీ, నాగేశ్వరరావు, దేవరభాలను పూజారులు తలపతులు, దీక్ష బాలలు సమ్మక్క తల్లి సాగనంపు ఊరేగింపు లో పాల్గొన్నారు. కోయతుత్తూర్ సంప్రదాయ పద్ధతుల్లో సాగ నంపారు





# 13 కిలోల గంజాయి పట్టివేత

**ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**నర్సంపేట తొలి సమయం ఫిబ్రవరి 15:**
వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో 13 కిలోల గంజాయి పట్టుబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది హైదరాబాదుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఎండి అసాద్, మోహిత్ కుమార్, అమిత్ కుమార్ అనే ముగ్గురు జలసాలకు, తాగుడుకు, అలవాటు పడి ఈజీగా డబ్బును ఏ విధంగా సంపాదించాలని ఉద్దేశంతో గంజాయి స్మగ్లర్లగా అవతారమెత్తి శనివారం ఖానాపురం పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు.. గంజాయి కొనుగోలు కోసం ఒరిస్సా వెళ్లి 6 వేల రూపాయల గంజాయి కొనుగోలు చేసి దానిని అమ్మేందుకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో దిగారని పోలీసులు తెలిపారు. శుక్రవారం రైల్వే స్టేషన్ లో తనిఖీలు ఎక్కువ చేయటంతో మహబూబాద్ రైల్వే స్టేషన్ లో దిగిన స్మగ్లర్లు ఓ ప్రైవేటు వాహనంలో ఖానాపురం మండలం లోకి ప్రవేశించారు. కానాపురం ఎస్సై రఘుపతి తన సిబ్బందితో వీరిని చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి దగ్గర నుండి 9 కిలోల గంజాయి తో పాటు రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై తెలిపారు

**చెన్నారావుపేట లో నాలుగు కేజీల గంజాయి కలకలం**

మహబూబాబాద్ నుండి వరంగల్ కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న





ఇద్దరు వ్యక్తులను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ నుండి వరంగల్ కు గంజాయిని తరలిస్తున్నారని విశ్వాసనీయ సమాచార మేరకు చెన్నారావుపేట పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మారం చేశారు. ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి చెక్ చేయగా బండి శ్రావణ్ కుమార్, రాజేష్ అనే ఇద్దరు వ్యక్తుల నుండి రెండు బ్యాగులు నాలుగు కేజీల గంజాయి దొరికినట్లు సమాచారం. ద్విచక్ర వాహనం తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. సోషల్ మీడియాలో.. ఈ ఘటన వైరల్ కావడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ స్పెల్ బి పోటీల్లో విజ్ డమ్ హై స్కూల్ హవా



**నర్సంపేట తొలి సమయం ఫిబ్రవరి 15:**
రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ స్పెల్ బి పోటీల్లో విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులు అపూర్వ ప్రతిభను కనబరచి నగదు బహుమతులను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో వివిధ జిల్లాల నుంచి దాదాపు 70 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా విజ్ డమ్ హై స్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి అల్లి అర్జున్ రాష్ట్రస్థాయిలో సూపర్ సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి 10,116 రూపాయల నగదు బహుమతితో పాటు ట్రోఫీ సాధించగా, ఇదే సూపర్ సీనియర్స్ విభాగంలో 9వ తరగతికి చెందిన దీపక్ తృతీయ స్థానంలో నిలిచి 2,116 రూపాయల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, జూనియర్స్ విభాగంలో 3వ తరగతికి చెందిన రాయిడి హిమచరితా రెడ్డి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి 5,116 రూపాయల నగదు బహుమతి తో పాటు ట్రోఫీ ని కైవసం చేసుకోవడం జరిగింది. వీరితోపాటు 10వ తరగతి సాయికిరణ్, 7వ తరగతి రిత్విక, సమన్విత, 6వ తరగతి సాఫ్రిన్, 3వ తరగతి వాత్సల్య, 2 వ తరగతి అర్జున్ కృష్ణ లు ప్రోత్సాహక బహుమతులను సాధించడం జరిగింది. ఈ బహుమతులను ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రజా కవి జయరాజ్, గేయ రచయిత యస్పాల్, అక్షర నిర్మాణం ఫౌండేషన్ చైర్మన్ మంచాల నాగరాజు, నిర్మలా రాజన్ అందించడం జరిగింది. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేసిన విద్యార్థులను మరియు గైడ్ టీచర్ వీరభద్రయ్య, రాజేంద్రప్రసాద్, చెన్నస్వామి, దివ్య జ్యోతి, పృథ్వి, సునీత గార్లను పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్చార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తాన, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## జాతీయస్థాయి క్రీడలో రజిత పథకాన్ని కైవాసం చేసిన గురుకుల విద్యార్థిని రుచిత

**వరంగల్ తొలి సమయం ప్రతినిధి ఫిబ్రవరి 15:**



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలకు చెందిన రుచిత, ఫస్ట్ ఎంపీసీ జాతీయ స్థాయి ఫెన్సింగ్ గేమ్ లో గెలుపొంది రజత పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ అపర్ణ తెలిపారు. బీహార్ లోని పాట్నాలో పాటలీపుత్ర స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో 10,11,12,13 తారీకు లలో జరిగిన పోటీలో గెలిచిన రుచితను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సపాల్ పి.అపర్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం మరియు పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇల్లందుల రాణి, వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పేరెంట్స్ కమిటీ సభ్యులు. మంకాల యాదగిరి, బిర్రు కరుణాకర్, పసునూరి భాస్కర్, ఉపేందర్, పొనగంటి స్వామి,విద్య మల్లికార్జున్, మాదాసి కృష్ణ, అనిల్ రావు తదితరులు అభినందించారు.


## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలకు పిలుపు

**హైదరాబాద్ తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి 15**



భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర వ్యాప్తం గా వివిధ సేవా కార్యక్రమాలు లని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలోనీ అన్ని జిల్లాలు డివిజన్లోని మండలా లలోని ప్రతి పల్లెలో ఈనెల 17న కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎవరికి తోచినవిధంగా ఇతరుల కు సహాయపడేలా కార్యక్రమాలు నిర్వహిం చాలని సూచించారు. రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సామాజిక సేవా కార్యక్ర మాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నెక్కొండ తొలి సమయం ఫిబ్రవరి 15:**
వరంగల్ జిల్లా నెక్కొండ సుమంగళి ఫంక్షన్ హాల్ లో సూరిపల్లి మాజీ సర్పంచ్, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె భద్రయ్య-కోమల కుమారుడు వంశీ-సృజన గార్ల వివాహ వేడుకకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి వారి వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోగుల జయశ్రీని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**నర్సంపేట తొలి సమయం ఫిబ్రవరి 15:**
వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాపరెడ్డి తల్లి అనారోగ్యంతో కొద్ది రోజుల నుండి బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. శనివారం ఆమె అస్వస్థకు గురికావడంతో ఆ విషయం తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని హైదరాబాద్ చేరుకున్న బిజెపి తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కేంద్ర హెూం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు.ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న జయశ్రీ ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. నేనున్నా మీ కేం కాదని బిజెపి నేతలు రాణి రుద్రమ రెడ్డి, రాణా ప్రతాపరెడ్డిలకు మనోధైర్యాన్ని నింపారు. మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



# మొక్కజొన్న రైతులను ముంచిన బహుళ జాతి మొక్కజొన్న విత్తన కంపెనీలు

**మొక్కజొన్న రైతులకు నష్ట పరిహారంగా లక్ష యాభై వేలు చెల్లించాలి**

**వ్యవసాయ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలి**

**ఈ ఘటనపై గవర్నర్ కు ఫిర్యాదు చేస్తానని డిమాండ్**

**ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు.. కొర్స నర్సింహా మూర్తి**





**వెంకటాపురం ( తొలి సమయం) ఫిబ్రవరి 15**
ఒప్పంద వ్యవసాయం పేరుతో విదేశీ విత్తన బహుళ జాతి కంపెనీలు ఏజెన్సీ రైతులను నట్టేట ముంచుతున్నాయని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాండ్ మొక్కజొన్న వ్యవసాయం అంటే కంపెనికి రైతులకు మధ్య జరిగే ఒప్పందం అన్నారు. కానీ రైతులకు కంపెనికి మధ్య దళారులు ఎందుకని నర్సింహా మూర్తి అన్నారు. శనివారం బర్లగూడెం, మొరుమూరు గ్రామపంచాయతీ లకు చెందిన రైతులు ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ని కలిసి తమ గోడు వెళ్ళబుచ్చినట్లు ఆయన మీడియా కు తెలిపారు. ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మాట్లాడుతూ హై టెక్ మొక్కజొన్న విత్తనాలు రైతులకు ఇచ్చి హై టెక్ మోసం చేశారని అన్నారు. హై టెక్ మొక్కజొన్న విత్తనం 250 ఎకరాల్లో సాగు చేస్తే గింజలు ఎక్కలేదని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎకరానికి నాలుగు నుండి ఐదు టన్నులు దిగుబడి వస్తుందని వెంకటాపురానికి చెందిన ఒక దళారీ విత్తనాలు ఇచ్చినట్లు రైతులు తెలుపుతున్నట్లు వివరించారు. కానీ క్షేత్ర స్థాయిలో ఒక్క టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారని తెలిపారు. ఏజెన్సీ ని ఒక ప్రయోగ శాలాగా మార్చి విదేశీ నూతన వంగడాలను ఇక్కడ ప్రయోగం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త వంగడాలను ఇక్కడ భూముల్లో ట్రైయల్ వేసి సక్సెస్ అయితే మళ్ళీ విదేశాలకి తీసుకుళ్తున్నారని పేర్కొన్నారు. అక్కడి దేశాల్లో ఈ విధంగా భూముల్లో ప్రయోగాలు చేయడం చట్ట విరుద్ధం అన్నారు. ఇండియా లో మారుమూల ప్రాంతాలను ఎంచుకొని విత్తన చట్టాలకు విరుద్ధంగా రైతుల చేత ప్రయోగాలు చేపించడం నేరం అన్నారు. అమాయక రైతులను ప్రతియేటా మొక్కజొన్న పేరుతో కోట్ల రూపాయలకు ముంచు తున్నారన్నారు. డీలర్స్ రైతుల దెగ్గర పట్టా జిరాక్స్ లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్స్ తీసుకొని కంపెనీ ఇచ్చే కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ధ్వజం మెత్తారు.కమిషన్స్ కోసం విజయంతం గాని విత్తనాలను రైతులకు అంటగట్టి కోట్ల రూపాయలు దళారులు కూడగట్టు కోవడం పైన ఆయన మండిపడ్డారు. విజయవంతం అయిన విత్తనాలు ఇస్తే దళారులకు పెద్దమత్తం లో డబ్బులు రావని ఈ అఘాయిత్యానికి పాల్పడుతున్నట్లు తెలియజేసారు. ఫెయిల్ అయిన విత్తనాల ద్వారా వచ్చే కోట్ల రూపాయల కోసం ఈ దారుణాలకు ఒడిగడుతున్నట్టు వివరంచారు. రైతుల భూములను రైతులకే తెలియకుండా తీసుకొని వాళ్ళ భూముల్లో వాళ్లనే కూలీలను చేసి శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ అధికారులు చేతివాటం చూపెట్టబట్టే దళారులు మోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు తెచ్చి రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తూ ఉంటే వ్యవసాయ అధికారులు నిద్ర పోతున్నారా అని నిలదీశారు. వ్యవసాయ అధికారుల అలసత్వం కారణంగానే కొన్నేళ్లుగా ఈ అక్రమ ఒప్పంద వ్యవసాయం జరుతొందని అన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, కమిషనర్ ఆపైన సెక్రెటరీ వీళ్లందరి పైన వ్యవసాయ మంత్రి వీళ్లంతా ఏమి చేస్తూ ఉన్నట్టని ప్రశ్నించారు. అధికారుల అలసత్వం కారణంగానే ఇలాంటి మోసాలకు అవకాశం ఏర్పడుతులోందని అన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, నకిలీ ఎరువులు రైతులకు అంటగట్టి రైతుల ఆత్మ హత్యలకు కారకులు అవుతున్నారని అన్నారు. ఎద్దేడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు అని అన్నారు. వ్యవసాయ శాఖా అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర టి ఎస్ ని కోరినారు. ఎకరానికి లక్ష యాభై వేల రూపాయలు నష్టపరిహారం, ఎకరానికి యాభై వేల రూపాయలు భూమి కౌలు కంపెనీ నుండి ఇప్పించాలని నర్సింహా మూర్తి డిమాండ్ చేశారు. నకిలీ విత్తన చట్టం 1966 ప్రకారం కంపెనీ పైన, దళారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ ని కోరినారు. ఎస్సి ఎస్టీ కమిషన్ కి, మానవ హక్కుల కమిషన్ కి, రాష్ట్ర గవర్నర్ కి త్వరలోనే లేఖ రాయనున్నట్లు నర్సింహా మూర్తి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బర్లగూడెం, మొరుమూరు రైతులు పాల్గొన్నారు..

# రహదారుల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద






వరంగల్/ నెక్కొండ తొలి సమయం ఫిబ్రవరి 15.
రహదారుల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శనివారం నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ లో హైబ్రిడ్ వార్షిక నిర్వహణ కింద రోడ్ల భవనాల శాఖ ద్వారా మరమ్మతులు, బలోపేతం అప్ గ్రేడేషన్, రీసర్ఫేసింగ్ చేస్తున్న రహదారులను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే రోడ్లపై గుంతలు నింపడం, మరమ్మతులు, నవీకరణ, అత్యవసర పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా వరదల సమయంలో దెబ్బతిన్న నర్సంపేట- నెక్కొండ రోడ్డు ను, నెక్కొండ- గూడూరు రోడ్డు, మరియు కేసముద్రం -నెక్కొండ రోడ్, లను పరిశీలించి రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలన్నారు. వెంకటాపూర్ గ్రామం సమీపంలో వరదల వల్ల రాకపోకలకు అంతరాయం కలిగిన రెండు లో లెవెల్ కాజ్వే లను, రోడ్డు ఆనకట్ట పై వేసిన పైపులైను పరిశీలించి వెంటనే బిటి సర్ఫేసింగ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రధాన రహదారులైన హనుమకొండ-నర్సంపేట, మహబూబాబాద్- నర్సంపేట రోడ్డును, పాకాల రోడ్డును కూడా మరమ్మత్తులకు ప్రతిపాదించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ వెంట జిల్లా రోడ్ల భవనాల శాఖ డీఈ రమాదేవి, ఏఈ గోపి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య దంపతులు

**వరంగల్ తొలి సమయం ప్రతినిధి ఫిబ్రవరి 15:**
హనుమకొండలోని మడికొండ సత్యసాయి కాన్వెన్షన్ లో జరిగిన స్టేషన్ ఘనపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపోలు శివ చరణ్ రెడ్డి వివాహమహోత్సవానికి హాజరై నూతన వధూవరులను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య - డాక్టర్ నజీర్ దంపతులు ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## యుద్ధ ప్రాతిపదికన వాహనాలకు మరమ్మత్తులు చేపట్టాలి

**బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**

**బల్దియా వాహన షెడ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్**



**వరంగల్ తొలి సమయం ప్రతినిధి పొనగంటి స్వామి రావు ఫిబ్రవరి 15:**
యుద్ధప్రాతిపదికన వాహనాలకు మరమ్మత్తులు చేపట్టాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.
హనుమకొండ లోని బాల సముద్రంలో గల వాహన షెడ్ ను శనివారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మరమ్మతులకు గురైన వాహనాల వివరాల తో పాటు షో రూమ్ లకు తరలించి మరమ్మతులకు చేపట్టపడు తున్న భారీ వాహనాల వివరాలను, ఎప్పుడు మరమ్మత్తులకు పంపించారో తేదితో సహా తెలియజేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వెహికల్ షెడ్డులో నిరుపయోగంగా పడి ఉన్న వాహనాల జాబితా ను అందజేయాలని వాటిని వినియోగించకుండా ఉండడానికి గల కారణాలు తెలియజేయాలని చెత్త తరలింపునకు ఉపయోగించే వాహనాలలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న వాహనాలు మరమ్మత్తులకు గురైన వాహనాల సమాచారాన్ని అందజేయడం తో పాటు వెహికల్ షెడ్డు ఆవరణలో ఉన్న మొత్తం వాహనాలు వెహికల్ నెంబర్ లతో సమగ్ర సమాచారం తో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఈ ఈ మహేందర్ శానిటరీ సూపర్ వైజర్ నరేందర్ ఏ ఈ ఫణి శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ స్మార్ట్ సిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవం

**చిత్రపటానికి పూల మాల వేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**



**వరంగల్ తొలి సమయం ప్రతినిధి పొన్నగంటి స్వామి రావు ఫిబ్రవరి 15:**
శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవం, మహాభోగ్ భండారో కార్యక్రమం శనివారం ఉదయం హనుమకొండ గిరిజన భవన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుండి గిరిజన భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన భవన్ లో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని సంతు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణ, అడవులను కాపాడుకోవడం అన్ని సామాజిక వర్గాలను సమానత్వం కోసం కృషి చేశారు, వారి ఆశయాలను అందరం అనుసరించాలని, అన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గం, పరకాల నియోజకవర్గం కమిటీలు ఏర్పాటు చేసుకొని సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలను నిర్వహించు కుంటున్నామని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ రాథోడ్, కాజీపేట తాసిల్దార్ బావ్ సింగ్, హనుమకొండ తాహసిల్దార్ శ్రీపాల్ రెడ్డి మరియు సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు, గిరిజన సంఘ నాయకులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

## శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ జయంతి

**పాలకుర్తి మండల కేంద్రంలో ర్యాలీ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 15**



పాలకుర్తి మండలం లో ఈరోజు నిర్వహించబడిన సంబరాలు జరిపిన గిరిజన ప్రజలు, ర్యాలీలో పాల్గొని నృత్యాలు చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ గారి జీవితాన్ని స్మరించుకున్నారు. సేవాలాల్ మహరాజ్ గారు బంజారా సమాజానికి గొప్ప మార్గదర్శకులుగా, సమాజ సాంస్కృతిక, ఆధ్యాత్మిక అభ్యున్నతికి విశేషంగా సేవచేసిన మహానుభావుల ని వారు పేర్కొన్నారు. సేవాలాల్ గారి ఆదర్శాలు, బోధనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, సమాజ సమగ్రాభివృద్ధికి ప్రేరణగా ఉంటా యని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బంజారా ప్రజాప్రతినిధులు, బంజారా నాయకులు, నియోజకవర్గ నాయకులు, వివిధ మండలాల బంజారా నాయకులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంటల ఉత్పత్తి..ఎగుమతులపై కార్యాచరణ కావాలి !

భారతదేశంలో వాణిజ్యపంటలకు కొదువ లేదు. మనదేశ ప్రజలకు అవసరమైన అన్ని రకాల వాణిజ్య పంటలతో పాటు, ఉప్పులు,పప్పులు పండుతాయి. నూనెగింజలు పండుతాయి. అందులో పసుపు, మిర్చి, పత్తి, ధనియాలు, అల్లం, వెల్లుల్లి, వేరుశనగ, నువ్వులు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో పాలు రకరకాల వరిధాన్యం కూడా పండుతుంది. మన నేలలో ఈ పంటలకు అనువుగా ఉన్నాయి. నేలలకు అనువుగా మనకు నదులు, సరస్సులు ఉన్నాయి. క ష్టపడి పండించేందుకు అన్నదాతులు సిద్ధంగా ఉన్నారు. లేనిదల్లా ప్రోత్సాహం ఒక్కటే. అయినా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తిందామంటే తిండిదొరకని ఎన్నో కుటుంబాలను చూస్తున్నాం. దేశంలో పండుతున్న పంటను ప్రోత్సహించి, ప్రజలకు తిండిగింజల కొరత లేకుండా చేయడం ఒక ఎత్తు. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించి విదేశాలకు ఎగుమతులు చేయడం మరో ఎత్తు. ఇలా ఒక్క వ్యవసాయంతోనే మన దేశ దరిద్రం తీరుతుంది. భూములు, వనరులు, మానవ వనరులు ఉన్నా ఉపయోగించే నైపుణ్యం ప్రభుత్వాలకు ఉండడం లేదు. అందుకే దేశీయంగా పంటలను ప్రోత్సహించడం లేదు. గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. దీనికితోడు అసవరమున్నా లేకున్నా అన్నీ దిగుమతి చేసుకునేం దుకు అలవాటు పడ్డాం. ఈ క్రమంలో దేశీంగా పసుపు, మిర్చి, పత్తి పంటలు విపరీతంగా పండుతున్నా ధరలు లేక రైతులు దిగాలు పడుతున్నారు. ప్రజలేమో ధరలు పెట్టి కొనలేక బాధపడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పసుపు రెండు వేల సంవత్సరాలుగా ఒక అద్భుత ఔషధంగా, సౌందర్య సాధనంగా, వంటలలో ముఖ్యమైన దినుసుగా, వస్త్రాలపై అద్దకంగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా హిందువులు తమ నిత్యజీవితంలో ఏ శుభకార్యమైనా పసుపుతోనే ప్రారంభిస్తారు. భారతదేశంలో పసుపు లేని ఇల్లు ఉండదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పసుపుతో పాటు మిర్చి, అల్లం వెల్లుల్లి కూడా వాణిజ్యస్థాయిలో పండించే సత్తా మన రైతులకు ఉంది. అలాంటి పసుపుకు బోర్డు కోసం రైతులు ఏళ్లుగా పోరాడాల్సి వచ్చింది.

రైతు తలచుకుంటే పంట పండించడమే కాదు, పంటకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బోర్డు ఎలా సాధించుకోవాలో కూడా తెలుసు. పసుపు బోర్డు సాధించి చూపించిన నిజామాబాద్ రైతులు దేశవ్యాప్తంగా ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచారు. పసుపు బోర్డు కోసం 2006లో మొదలైన పోరాటం 2 దశాబ్దాలుగా అలుపెరగకుండా సాగింది. ఇకపోతే పంజాబ్, హర్యానా రైతులు కూడా పంటల గిట్టుబాటు ధరల కోసం ఏళ్లుగా పోరాడుతున్నారు. వారి వెనక రాజకీయ కోణాలు ఉన్నాయన్న విషయాన్ని పక్కన పెట్టి వారితో చర్చించి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రకటించడం లేదు. ఇకపోతే తెలంగాణలో పసుసు బోర్డు ఏర్పాటయ్యింది కనుక ఇక వారి కష్టాలు గట్టెక్కాల్సిన అవసరం ఉంది. పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం ఓ రకంగా రైతుల విజయానికి నాంది అనుకోవాలి. పసుపు బోర్డు సాధనలో వారు చూపిన తెగువ ఎనలేనిది. 2019 లోకసభ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నిజామాబాద్ ఎంపీ గా పోటీచేయడానికి నామినేషన్ వేయడం. వీరికోసం ఏకంగా ఒక్కో బూత్‌లో 12 ఈవీఎం మిషన్లు వాడాల్సి రావండ వంటివన్నీ జాతీయస్థాయిలో సమస్యను చాటాయి. వీరు దాదాపు లక్ష ఓట్లు పొందడం ఆ ప్రాంతంలో పసుపు బోర్డు డిమాండ్ ఎంత బలంగా ఉందో అనడానికి నిదర్శనంగగా నిలిచింది. అంతే కాకుండా వారణాశిలో 30 మంది పసుపు రైతులు నామినేషన్ వేసి మోదీపై పోటీకి దిగారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో కూడా దాదాపు 27 మంది రైతులు పోటీచేశారు. పొలాల్లో పంటలు పండించడమే కాదు, రాజకీయ చతురత కూడా ప్రదర్శించగలమని రైతన్నలు నిరూపించారు. అయితే రైతులు పోరాటాలుచేస్తే తప్ప సమస్యలు గుర్తించకుండా ప్రభుత్వాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఇదే తరహాలో మిర్చి బోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. నిజానికి రైతుల ఆకాంక్షల మేరకు బోర్టులు ఏర్పాటు చేయడో లేదా...పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రోత్సహించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వాల విధి. ఒక బోర్డుల ఏర్పటును పరిశీలిస్తే...కాఫీ ఉత్పత్తులు పెంచడానికి 1942లో బెంగళూరు కేంద్రంగా కాఫీ బోర్డును స్థాపించారు. రబ్బరులో శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనలు, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి 1947లో కేరళలోని కొట్టాయంలో రబ్బర్ బోర్డును స్థాపించారు.టీ ఉత్పత్తి, ఎగుమతులు పెంచడానికి 1954లో కోల్‌కత్తాలో టీ బోర్డును స్థాపించారు. టొబాకో ఎగుమతులు పెంచడానికి1976 లో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో టొబాకో బోర్డు స్థాపించారు. కొబ్బరి ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తుల వైవిధ్యీకరణపై దృష్టి సారించి దేశంలో కొబ్బరి ఉత్పత్తి, వినియోగం కోసం సమగ్ర అభివృద్ధి కోసం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును 1981లో కేరళలోని కొచ్చిన్ లో స్థాపించారు. ఇలా పంటల దిగుబడిని పెంచి, రైతులకు లాభాలు చేకూర్చడంతో పాటు, ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచడం లక్ష్యంగా ఆయా బోర్డులను పెంచారు. అలాగే ఆయ పంటల ఉత్పత్తులపైనా ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది. రైతులకు లాభం చేకూర్చేలా ఎగుమతులకు అనుకూల పరిస్థితులు సృష్టించడం, పంట నాణ్యతను మెరుగుపర్చడం, కొత్త వంగడాల అభివృద్ధి కోసం పరిశోధనలు నిర్వహించి సలహాలు అందించడం, పంట విస్తీర్ణాన్ని పెంచడం, అధిక దిగుబడుల కోసం కృషి చేయడం అవసరం. పసుపు సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం,పసుపు రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు పసుపు ఔషధ ప్రయోజనాలపై అవగాహన పెంచడం కోసం తాజాగా పసుపు బోర్డు ఏర్పాటు అయ్యింది. ఈ బోర్డు ద్వారా రైతులకు పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందించడం జరుగుతుంది. పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందిస్తుంది. ఇక పసుపు పంట మార్కెటింవిగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. పసుపు పండిస్తున్న 20 రాష్ట్రాల రైతులకు ప్రత్యేక లాభం చేకూర నున్నది. అయితే పంట ఏదైనా దేశీయంగా చవకగా లభించి, ఎగుమతుల ద్వారా రైతులకు ఆర్జన చేసి పెట్టేలా పంటల విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్త బలోపేతం కావడంతో పాటు, దేశ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడగలదు.

# పసుపు ఎగుమతుల ద్వారా విదేశీ మారకం

**- ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతం భారత్‌దే - మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే దూసుకెళ్లడం ఖాయం**

**నిజామాబాద్,ఫిబ్రవరి15:** నిజామబాద్ కేంద్రంగా పసుపు బోర్డుల ఏర్పాటైనందున ఇక పసుపును అంతర్జాతీయంగా ఉత్పత్తి చేసి, ఎగుమతులు చేసేలా ప్రోత్సహించాల్సి ఉంది. ఇందుకు బోర్డు కార్యాచరణ కు దిగాలి. పసుపు బోర్డుకి సంబంధించిన ఈ విజయగాథ నిజామాబాద్ రైతుల పోరాట పటిమను, కృషిని, పట్టుదలని ప్రతిబింబిస్తోంది. దేశవ్యాప్తంగా ఇతర రైతులకు కూడా ఇది ఒక ఆదర్శంగా నిలిచింది. నిజామాబాద్‌తో పాటు జగిత్యాల, ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు విరివిగా పండుతుంది. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు పండుతుంది. మన పసుపు ఎక్కువగా బంగ్లాదేశ్, యూఏఈ, అమెరికా, మలేషియాకి ఎగుమతి అవుతున్నది.

కాగా, వ్యవసాయ విభాగానికి అందించే సబ్సిడీలు నేరుగా రైతులకు చేరాల్సిన అవసరం ఉంది. రైతులు, వ్యవసాయ పరిశ్రమల మధ్య లాభాలను సమానంగా పంచుకోవాలి. రైతులు వ్యవసాయానికి ఖర్చుచేసే ప్రతి రూపాయి దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది. గత సంవత్సరం, 2023-24, భారతదేశంలో 3.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 10.74 లక్షల టన్నుల ఉత్పత్తితో పసుపు సాగు చేయబడింది. ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతంనకు పైగా భారతదేశం పండిస్తోంది. మన దేశంలో 30 రకాల పసుపు ఉత్పత్తి అవుతోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం 62శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. 2023-24లో, 226.5 మిలియన్ డాలర్లు విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. భారతదేశం నుంచి పసుపు ఎగుమతులు 2030 నాటికి బిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా. ఇకపోతే పసుపుబోర్డుకు ముందు స్పైసెస్ బోర్డు అన్నారు. నిజానికి దీనిని 1987 కేరళలోని కొచ్చిన్ లో 52 సుగంధ ద్రవ్యాలు, మసాలా ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి స్థాపించారు. పసుపు కూడా స్పైసెస్ బోర్డు పర్యవేక్షణలో ఉండేది. కానీ అంత ప్రాధాన్యం ఉండేది కాదు. కాబట్టి ప్రత్యేక బోర్డు సాధనకు 2019 లోక్ సభ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ను గెలిపించి, పసుపు రైతుల గళం ఢిల్లీలో వినిపించాలనుకున్నారు. 2020లో కేంద్రం నిజామాబాద్‌లో స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, ఎక్సటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ 'ట్రేడ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీమ్'ని అమలుపరుస్తూ పసుపు సాగుకు మౌలిక వసతులు కల్పిస్తూ ఎగుమతులకు పెంపొందించడానికి దోహదపడింది. కానీ, పసుపు రైతులు ప్రత్యేక బోర్డు కావాలని పట్టుబట్టారు. రైతుల అలుపెరగని పోరాటాన్ని గుర్తించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలమూరు ప్రజాగర్జన సభలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత సంక్రాంతి పండుగ సందర్భంగా నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం చేశారు. ఇది ఓ విజయమైతే...రైతులు పంటలను పండించి, ఆదాయం పొందితే అంతకుమించిన విజయం ఉండదు.

# మరోమారు వార్తల్లోకి శీష్‌మహల్

**- పునరుద్ధరనలో నిధుల దుర్వినియోగం - ఆప్ అవినీతిప విచారణకు ఆదేశాలు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి15:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజీవ్రాల్‌ను కష్టాలు వెంటాడు తున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో అధికారం కోల్పోయి.. నిరాశలో ఉన్న కేజీవ్రాల్‌కు కేంద్రం షాకిచ్చింది. 'శీష్ మహల్' అక్రమాలపై దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. బంగ్లా పునరుద్ధరణ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ బీజేపీ ఎమ్మెల్యే విజేంద్ర గుప్తా లెప్టినెంట్ గవర్నర్ వీకే.సక్సేనాకు ఫిర్యాదు చేశారు. ఎల్జీ ఆదేశాలతో ఫిబ్రవరి 13న కేంద్ర ప్రజా పనుల శాఖ నివేదిక సమర్పించింది. తాజాగా పునరుద్ధరణలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలంటూ కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ ఖజానాను విలాసవంతమైన వస్తువులకు ఖర్చు చేశారని బీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దర్యాప్తుకు ఆదేశించింది. దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో 6 ప్లాగ్‌స్టాఫ్ బంగ్లాను పునరుద్ధరణకు ఆప్ ప్రభుత్వం భవన నిబంధనలను ఉల్లంఘించిందనే ఆరోపణలపై విచారించి సమగ్ర నివేదిక తయారుచేయాలని కేంద్రం సీపీడబ్ల్యూడీని ఆదేశించింది. అధికారిక నివాసానికి పొరుగునున్న నాలుగు ప్రభుత్వ ఆస్తులను చట్టవిరుద్ధంగా విలీనం చేసి విలాసవంతమైన శీష్‌మహల్ ను విస్తరించారని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు. ఆ ఆస్తుల విలీనాన్ని రద్దు చేయాలని కోరుతూ లెప్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాశారు. దేశ రాజధానిలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాక నూతన ముఖ్యమంత్రి శీష్‌మహల్‌లో ఉండబోరని పేర్కొన్నారు. దిల్లీలోని 6 ప్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజీవ్రాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ గా భాజపా అభివర్ణిస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.. తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ దుయ్యబట్టిన సంగతి తెలిసిందే.

# మిర్చి పంటకు దక్కని కనీస మద్దతు ధర

**మార్కెట్‌ను పంట ముంచెత్తినా కానరాని కొనుగోళ్లు**

**పెట్టుబుడుల రాక అన్నదాతల ఆందోళన**



**గుంటూరు,ఫిబ్రవరి15:** గుంటూరు సహా ఖమ్మం, వరంగల్ జిల్లాలు మిర్చిపంటకు పెట్టింది పేరు. ఇక్కడ అతర్జాతీయ నాణ్యతలకు అనుగుణంగా మిర్చి పండుతోంది. అయితే ఏటా రైతులు మిర్చి బస్తాలను వేసుకుని మార్కెట్ యార్డుల్లో పస్తులు ఉంటున్నా ధరలు దక్కడం లేదు. ఈ క్రమంలో మిర్చిబోర్డు కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలి. ఇప్పటికే పంటలు రాక మొదలయ్యింది. వరంగల్ ఎనుమాముల, ఖమ్మంయార్డులతో పాటు, గుంటూరు మిర్చియార్డుల్లో నిల్వలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. గిట్టుబాటు ధర రాక, ఇళ్లల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక ఈ ఏడాది మిర్చి రైతులు అల్లాడుతున్నారు. ఎకరాకు లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతోంది. 15 క్వింటాలు కూడా దిగుబడి రావడం లేదు. గిట్టుబాటు ధర లభించకపోవడం లేదు. దీంతో, తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో క్వింటాలుకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలికింది. ప్రస్తుత ఏడాది రూ.9 వేలకు నుంచి రూ.13 వేల మించి ధర లభించడం లేదు. గత వారం రోజుల్లో క్వింటాలుకు రూ.3 వేలు తగ్గింది. అయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. వాణిజ్య పంటల్లో పొగాకు, తేయాకు, పసుపు తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తోంది. మిర్చికి మాత్రం ప్రకటించడం లేదు. దీంతో, వ్యాపారుల దాయాదక్షిణ్యాలపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది. 2018 నుంచి 2023 వరకు ధరలు మెరుగ్గా ఉన్నాయి. గత ఐదేళ్లలో సగటు ధర రూ.18 వేలకు తగ్గలేదు. గరిష్టంగా రూ.27 వేల వరకూ పలికింది. గతేడాది నుంచి ధరల తగ్గుదల ప్రారంభమైంది. మిర్చి ధరలో ఎంత భారీ వ్యత్యాసం ఎందుకు వచ్చిందో ప్రభుత్వం అధ్యయనం చేయాలి. సీజన్ మొదట్లోనే ధర తగ్గితే చివరికి ఎంత పతనం అవుతుందోనని ఆందోళనగా ఉంది. నష్టాలను భరించలేము. గిట్టుబాటు ధర కల్పించాలి.గతేడాది కనీస ధర రూ.12 వేల గరిష్ట ధర రూ.20 వేల వరకు వచ్చింది. ప్రస్తుత ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు మాత్రమే వస్తోంది. తేమ శాతం, తాలు సాకులు చూపి ధరను రూ.7 వేలకు కూడా తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎగుమతులు లేవని చెబుతున్న వ్యాపారులు రోజుకు లక్ష టిక్కిలు వచ్చినా కొనేస్తున్నారని, తాము పండించిన సరుకు అంతా ఎటుపోతుందోనని ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో రిటైల్ ధర కిలో రూ.200 నుంచి రూ.220 వరకు పలుకుతుండడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వారం రోజులుగా యార్డుకు సగటున రోజు 90 వేల నుంచి లక్ష టిక్కిల వరకు సరుకు వస్తోంది. ధరల తగ్గుదలపై రైతులు జిల్లాలోని ప్రజాప్రతినిధులపై రైతులు ఒత్తిడి తేగా, స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని రైతులను ఆదుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టిడిపి ఎంపిలు, ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవ రాయలు ఢిల్లీలోని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం ప్రతిపాదించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, మొత్తం కేంద్రమే భరించాలని ఎంపిలు కోరారు. ఈ అంశంపై ఇంతవరకూ కేంద్రం నుంచి స్పందన లేదు. తక్షణం క్వింటాలుకు రూ.12 వేలు తగ్గకుండా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం కింద సాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఇంతవరకు సానుకూలంగా స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీస మద్ధతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ప్రకటించాలని వారు కోరుతున్నారు.

# 13 మంది కౌన్సిలర్లు వైసీపీకి గుడ్‌బై

**అమరావతి, ఫిబ్రవరి15:** జిల్లాలో వైసీపీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒక్కొక్కరిగా వైసీపీని వీడుతూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి షాక్ ఇస్తున్నారు. ఇప్పటికే తుని పట్టణానికి చెందిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా.. అదే పార్టీకి చెందిన మరో 10 మంది కౌన్సిలర్లు తాజాగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మ్నొత్తం 13 మంది కౌన్సిలర్లు వైసీపీకి గుడ్ బై చెప్పినట్లు అయ్యింది. వీరందరికీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. త్వరలో తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఒక్కసారిగా ఇంత మంది ఫ్యాన్ పార్టీని వీడడంపై జిల్లాలో ఇప్పుడు పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. జిల్లాకు చెందిన మరికొంతమంది ముఖ్య నేతలు సైతం కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరేందుకు చూస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి వైఎస్ జగన్ తాడేపల్లి ప్యాలెస్?కు పరిమితం అయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీ శ్రేణులు కూటమి వైపు చూస్తున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఘోర ఓటమి, జగన్ తీరుపైనా నేతలు, కార్యకర్తల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిపోతోంది. దీంతో చాలా మంది నేతలు ఆయనకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రోజున ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని సైతం టీడీపీలో చేరారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101